క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీరాల అర్బన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పట్టణంలోని జయంతిపేట, మరియమ్మపేట, ఐక్యనగర్, ఉజిలిపేట ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ హరిప్రసాదరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

మృతి చెందిన పర్యాటకులకు సంతాపం

చినగంజాం: కాశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు సంతాపం, బంధువులకు సానుభూతిని తెలియజేస్తూ చినగంజాంలో జనసేన నాయకులు శుక్రవారం మానవహారం నిర్వహించారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయకుమార్ ఆధ్వర్యంలో చినగంజాం రంగాసెంటర్‌లో నాయకులు ఉగ్రవాదులు దాడులకు నిరసన తెలిపి, మృతులకు సంతాపం తెలియజేశారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ప్రభుత్వం దాడికి పాల్పడిన ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు, గోపినాథ్, టి. సతీష్, జి. లక్ష్మీనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం చైత్ర మాసం ఉత్తరాభాద్ర నక్షత్రం త్రయోదశి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శుక్రవారం తెలిపారు. క్షేత్ర ప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకుపూజ చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సురవ్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

25 ఆటోలకు జరిమానా



ఆటోలకు జరిమానా విధిస్తున్న ఎంవీఐ రవికుమార్

దర్శి (కురిచేడు): రికార్డులు లేకుండా తిరుగుతున్న 25 ఆటోలకు రూ.20 వేల జరిమానా విధించినట్లు దర్శి మోటారు వాహనాల తనిఖీ అధికారి ఏటీ రవికుమార్ తెలిపారు. స్థానిక అద్దంకి రోడ్డులో పొదిలి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ ధనలక్ష్మి, సిబ్బందితో కలిసి శుక్రవారం అద్దంకి రోడ్డులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆ సమయంలో వచ్చిన ఆటోలను తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా లేని వాటిని గుర్తించి జరిమానా విధించారు. జె.రామయ్య, మోటారు వాహనాల కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



యద్దనపూడిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కారంచేడులో మలేరియాపై అవగాహన ర్యాలీ



మేదరమెట్లలో..

మలేరియా ప్రమాదకరం

బల్లికురవ: ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని గుంటుపల్లి వైద్యాధికారి జి. రవితేజ కోరారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గుంటుపల్లి పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహించారు. మలేరియాను పారదోలేందుకు ప్రజాప్రతినిధులు గ్రామాల్లోని ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. వైద్యాధికారులు భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల: మలేరియా నివారణ నినాదం కావాలని చీరాల పీపీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ యాకోబు, డాక్టర్ వీరబ్రహ్మం అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా చీరాల ఏరియా వైద్యశాల నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా నివారణ మన నినాదం కావాలని, మలేరియా గురంచి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ చింతా శేషుబాబు, వసంత వల్లి, బీబేమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

యద్దనపూడి: మలేరియా రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యద్దనపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన యద్దనపూడిలో శుక్రవారం వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీహర్ష మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీటి నిల్వలు లేకుండా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించి పరిసరాలను శుభ్రపరచుకోవాలన్నారు. హెల్త్ ఆఫీసర్ టీ. విజయచంద్ర శివప్రసాద్, హెచ్ఈఓ వెంకటేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్లు సునంద, పెర్సీ, హెచ్‌ఏ కోటేశ్వరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మేదరమెట్ల: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు రావని తద్వారా మలేరియా వంటి వ్యాధులు దూరంగా ఉంటాయని డాక్టర్ చిట్టిబాబు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మేదరమెట్ల హెల్త్ క్లినిక్ నుంచి గ్రామంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని.. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే దోమలు రావన్నారు. దోమకాటు నుంచి దోమతెరలను వినియోగించుకోవాలని సూచించారు. హెచ్ఈవో బ్రహ్మానందం, పీహెచ్ఎన్ సుశీల, హెచ్‌వీ పద్మావతి, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

కారంచేడు: ఇంటి పరిసరాల పరిశుభ్రతతోనే మన నివాస ప్రాంతాల్లో మలేరియా వ్యాధిని నిర్మూలించవచ్చని కారంచేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోరంట్ల సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు పీహెచ్‌సీ పరిధిలో మలేరియా వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామంలోని అన్ని ప్రధాన వీధుల్లో వైద్య సిబ్బందితో కలసి మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలతో ఏర్పాటు చేసిన ర్యాలీలో ఆయన గ్రామస్తులకు మలేరియా వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ షాలినీ తమ సిబ్బందితో గ్రామంలో మలేరియాపై అవగాహన ర్యాలీ చేశారు. ఎంపీహెచ్ఈఓ వి. నాగేశ్వరరావు, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీసిఫోరా, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఎల్‌టీలు బయ్యా శంకర్, సుబ్బారావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

మమ్మేలు గంగమ్మ తల్లీ..!



గంగమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు, మహిళలు

కారంచేడు: గ్రామ దేవత గంగమ్మ తల్లి 38వ శిడి మహోత్సవం, తిరునాళ్ల పురస్కరించుకొని శుక్రవారం అమ్మవారికి గ్రామస్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారికి పూలాభిషేకాలు నిర్వహించారు. పాలవెల్లి, కథా కాలక్షేపం చేశారు. మహిళలు పెద్ద ఎత్తున్న మమ్మేలు తల్లీ.. మా గంగమ్మ తల్లీ అంటూ పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ భక్తులతో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పొగాకు రైతులకు ఆత్మహత్యలే శరణ్యం



సుబ్బారెడ్డికి వినతి పత్రాన్ని అందిస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలో సాగు చేసిన బర్లీ పొగాకుకు గిట్టుబాటు ధరను కల్పించి కొనుగోలు చేయాలని రైతు సంఘాల సమన్వయ కమిటీ సభ్యులు, రైతులు శుక్రవారం కొరిశపాడు మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సాగు వైపు ప్రోత్సహించిన ప్రభుత్వం తీరా పండించిన తరువాత గిట్టుబాటు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమైందని సంఘ సభ్యులు విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బర్లీపొగాకు కొనుగోలుకు బోర్డును కేటాయించి పొగాకు కొనుగోలు చేయించేలా చర్యలు తీసుకోవాలని ..లేకుంటే ఆత్మహత్యలకు పాల్పడటం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ సుబ్బారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. రైతు సంఘ నాయకులు రైతులు పాల్గొన్నారు.

బీమా పథకాలకు ప్రీమియం చెల్లించండి

బల్లికురవ: బ్యాంకులో ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బీమా పథకాలకు ప్రీమియం చెల్లించాలని బల్లికురవ ఆంధ్ర ప్రగతి బ్యాంక్ చీఫ్ మేనేజర్ కె. సీనా నాయక్ కోరారు. శుక్రవారం మండలంలోని చెన్నుపల్లి గ్రామానికి చెందిన పాలపర్తి ఏసురత్నం మృతి చెందగా, రెండు లక్షల రూపాయల చెక్కును ఆయన భార్య అంజమ్మకు అంజేశారు. ఏసు రత్నం ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజనలో చేరి ఉండటంతో అకాల మరణం పొందినా నామినీకి పరిహారం అందజేయగలిగామని మేనేజర్ తెలిపారు. మేనేజర్ సీహెచ్ రవీంద్రబాబు, అసిస్టెంట్ మేనేజర్ సునితా గ్రేస్, కుమారి బిందు మాధవి పాల్గొన్నారు.



బీమా చెక్కు అందజేస్తున్న చీఫ్ మేనేజర్

జ్యోతి ఆంజనేయులు విగ్రహావిష్కరణ నేడు



కళాకారుడు జ్యోతి ఆంజనేయులు(ఫైల్)

మేదరమెట్ల: రంగస్థల కళాకారుడు.. దివంగత జ్యోతి ఆంజనేయులు తృతీయ వర్ధంతి పురస్కరించుకొని శనివారం మేదరమెట్ల గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు జ్యోతి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం నలుమూలలలో మూడువేలకు పైగా సత్యహరిశ్చంద్ర సహా ఇతర పౌరాణిక నాటకాల్లో తన ప్రతిభ చాటారని తెలిపారు. ముఖ్య అతిథిగా జబర్దస్త్ అప్పారావు హాజరౌతారని తెలిపారు. ఈ సందర్భంగా చింతామణి నాటక ప్రదర్శన ఉంటుందని వివరించారు.

చలివేంద్రం ప్రారంభం

చీరాల అర్బన్: చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చీరాల రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఒన్‌టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు ప్రారంభించారు. వేసవిలో పాదచారులు, ప్రయాణికులు దాహం తీర్చుకునేందుకు చీరాల రోటరీ క్లబ్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. రైల్వేస్టేషన్ ఎస్ఎస్ ఎన్.సింగయ్య, క్లబ్ సభ్యులు చందలూరి బాలవెంకటేశ్వరరావు, నక్కల సురేష్, పోలుదాసు రామకృష్ణ, వంగర పూర్ణచంద్రరావు, మామిడాల శ్రీనివాసరావు, దోగుపర్తి వెంకట సురేష్, చీరాల కృష్ణమూర్తి, జీవై ప్రసాద్, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

వితంతువులకు పింఛన్

అద్దంకి: భర్త పింఛన్ పొందుతూ మృతిచెందితే వారి భార్యలకు ప్రభుత్వం వితంతు పింఛన్ మంజూరు చేసేందుకు అవకాశం కల్పించిందని ఎంపీడీఓ శింగయ్య శుక్రవారం తెలిపారు. డిసెంబరు నెల ఒకటో తేదీ 2023 నుంచి 2024 అక్టోబరు నెల 31వ తేదీ మధ్యకాలంలో మృతి చెందిన పెన్షన్ దారుల భార్యలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సులభంగా భవన నిర్మాణ అనుమతులు

అద్దంకి రూరల్: స్వీయ ధ్రువీకరణ అంగీకార పత్రం సమర్పించి సులభతరంగా భవన నిర్మాణ అనుమతులు పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ డి. రవీంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఈ కార్యాలయం ద్వారా లైసెన్స్ కోసం భవన నిర్మాణన అనుమతులు స్వీయ ధ్రువీకరణ ద్వారా పత్రం సమర్పించి సులభంగా వేగంగా అత్యంత పారదర్శకంగా పొందవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగి అర్హులైన అభ్యర్థులు (ఐటీఐ సివిల్, బీటెక్ సివిల్) కార్యాలయానికి నేరుగా గాని, ఏఈవోబీఎస్ పోర్టల్ ద్వారా లైసెన్స్ కోసం దరఖాస్తు చేసి లైసెన్స్ పొందాలని కోరారు.

పోషకాహారంలో పొరపాట్లు సహించం

పర్చూరు(చినగంజాం): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే పోషకాహారంలో పొరపాటు జరిగితే సహించేది లేదని ఐసీడీఎస్ పీడీ డి. రాధామాధవి హెచ్చరించారు. పర్చూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన ప్రాజెక్ట్ సమావేశంలో మాట్లాడారు. రెండున్నర సంవత్సరాలు దాటిన ప్రతి బిడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో హాజరయ్యే విధంగా చూడాలని, ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని, వేసవి కాలం తగిన జాగ్రత్తలు పాటిస్తూ వారికి మెనూ ప్రకారం భోజనం అందించాలని, కాంట్రాక్టర్‌లు అందించే ఆహారం.. నాణ్యత పరిశీలించి మాత్రమే తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారం విషయంలో ఎటువంటి పొరపాటు జరిగినా సహించబోమని హెచ్చరించారు. పిల్లలకు, బరువు, ఎత్తులు సరిగా తూచి రికార్డు చేయడం, వారి పోషణ స్థితిని తెలియజేయాలన్నారు. మే 2 నుంచి జూన్ 10 వరకు కిశోర్ బాలికలకు సమ్మర్ క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. సీడీపీఓ జి. సుభద్ర, జిల్లా సమన్వయకర్త సురేంద్ర, సూపర్‌వైజర్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ ప్రాజెక్ట్ సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రాధామాధవి

నేడు వీరాంజనేయ స్వామి తిరునాళ్ల



విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసిన వీరాంజనేయ స్వామి ఆలయం

బల్లికురవ: మండలంలోని పెద అంబడిపూడి గ్రామ సమీపంలోని చింత తోపులో వేంచేసి ఉన్న వీరాంజనేయ స్వామి 42వ వార్షిక తిరునాళ్ల శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీవారు శుక్రవారం తెలిపారు. వేడుకల్లో భాగంగా ఆలయ పరిసరాలను శుభ్రం చేసి ఆలయాన్ని విద్యుత్ దీపాలకు ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు జి. పవన్‌కుమార్ శర్మచే ఉదయం ఐదు గంటల నుంచే స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, తమలపాకులతో అర్చన, ప్రత్యేక అలంకరణ చేపట్టనున్నట్లు చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు ఆలయ సన్నిధానం వద్ద అన్న సంతర్పణ సాయంత్రం కోలాట ప్రదర్శన రెండు భారీ ఎలక్ట్రిక్ ప్రభలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



స్వామి మూలవిరాట్టు

నేటి నుంచి ఉరుసు మహోత్సవాలు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని కొమ్మాలపాడు గ్రామంలో పెద్దల ఆధ్వర్యంలో శని, ఆదివారాలు ఉరుసు మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. దీనిలో భాగంగా దర్గాను రంగులతో అలంకరించారు. ఆదివారం రాత్రికి విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామంతో పాటు పరిసరగ్రామాల భక్తులు కులమతాలకు అతీతంగా పాల్గొనాలని కోరారు.



రంగులతో అలంకరించిన కొమ్మాలపాడు దర్గా

దొండపాడులో ధ్వజ స్తంభం ప్రతిష్ట



ధ్వజ స్తంభం ప్రతిష్ట



విగ్రహాలకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లి పంచాయతీ పరిధి దొండపాడులో శ్రీరామచంద్ర విగ్రహ, జీవ ధ్వజ స్తంభం ప్రతిష్టను శుక్రవారం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. రెండు రోజుల నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పురోహితులు రామకృష్ణ శాస్త్రి, శివకుమార్ శాస్త్రి, నాగరాజుశర్మ ప్రత్యేక పూజలు చేసి ధ్వజ స్తంభం, శిఖర, కలశ, నూతన విగ్రహాల ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాలు జరిపారు. జీవ ధ్వజ స్తంభాన్ని భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు ప్రతిష్ఠించారు. ప్రతిష్ట కార్యక్రమానికి దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వాదం తీసుకున్నారు. చుట్టుపక్కల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. గ్రామస్తుల సహకారంతో అన్నదానం చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, కర్నాటి ఆంజనేయరెడ్డి, బత్తుల వెంకట సుబ్బయ్య యాదవ్, తమ్మనేని సుబ్బారెడ్డి, బాపనపల్లి శ్రీను, కన్నెధార వెంకట సుబ్బయ్య, వీరపనేని చెన్నయ్య పాల్గొన్నారు.

మేడేను ఘనంగా నిర్వహించాలి

దర్శి (కురిచేడు): కార్మిక చట్టాలను రద్దు చేస్తూ మోదీ ప్రభుత్వం తెచ్చిన 4 కోడ్ బిల్లులకు వ్యతిరేకంగా కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ పోరాడుతోందని జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శుక్రవారం జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశం షేక్ కాలేబాషా అధ్యక్షతన జరిగింది. సీపీఎం మండల కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు సమావేశంలో తీర్మానం ప్రవేశ పెట్టగా కార్మికులందరూ పెహల్గాం ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన అమరులకు సంతాపం ప్రకటించారు. అనంతరం రంగారావు మాట్లాడుతూ స్కీం వర్కర్స్ అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, పంచాయతీ తదితర కార్మికులకు 2019 నుంచి వేతనాలు పెంచలేదన్నారు. నిత్యావసరాల ధరలు రెట్టింపయ్యాయన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛ భారత్ కార్మికులకు 2010లో ఇచ్చిన జీఓ అమలు చేయాలని, ఆటో కార్మికులపై పెనాల్టీలు, పోలీసుల వేధింపులు పెరిగాయని, చిన్నచిన్న తప్పిదాలకు కూడా దారుణమైన శిక్షలు విధిస్తూ తెచ్చిన మోటారు వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేస్తోందని తెలిపారు. 2025 మేడే దినోత్సవం సీఐటీయూ ఆధ్వర్యంలో నియోజకవర్గం అంతా ఘనంగా నిర్వహిస్తూ కార్మిక సంఘాలు జెండా ఆవిష్కరణలు, ప్రదర్శనలు, సభలు నిర్వహించాలని, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని మేడే స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలపై పోరాటం చేయాలని సీఐటీయూ నిర్ణయించిందని తెలిపారు. సమావేశంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ముఠా, బిల్డింగ్, ఎల్ఐసీ, పంచాయతీ, ఆటో, స్వచ్ఛ భారత్ తదితర రంగాల యూనియన్ నాయకులు ఆలూరి ఇశ్రాయేల్, ఇత్తడి కోటయ్య, యెహోషువా, చవలం గంగయ్య, మాధవిలత, లక్ష్మీదేవి, ఉప్పు నారాయణ, ఈమని నాగేశ్వరరావు, గోగు వెంకయ్య, గర్నిపూడి జాన్ శామ్యేల్, రత్నకుమారి, ఆదిలక్ష్మి, పోట్లూరి పుల్లయ్య, ఆవునోక్, చలమయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com